**కథానిక**

# పరదా

## చామర్తి దుర్గాప్రసాద్

సుందరమూర్తిగారికి, "తెల్లవారదు". "ఆకాశ భామిని అధరాలు విప్పుతుంది." పెదిమలు దొండ పండులా ఎర్రగా ఉన్నవని ఆయన అనరు. అది వ్యాఖ్యాతల పని. రచయితగా తను అలా విశదం చెయ్యగూడదు.

తొలకరి జల్లు, ఆయనకి సన్నజాజుల రువ్వు
తారకలు, కన్నెల కేశరాసిలో విరిసిన మల్లెలు
వెన్నెల, పన్నెల నెరజాణనె నవ్వుల దొంతర

ఆయనకి వాన కురవదు. "ఆకాశ సరసిలో నల్లని ఏనుగులు జలకాలాడుకుంటాయి".

పరదా వేసుకొన్న బొమ్మ ఆయన ఇంట్లో ముందుగా కనబడుతుంది, ఎవరికయినా వెళ్ళగానే.

ప్రజల కష్టాల కాయన చలిస్తాడని వ్యాఖ్యాతలంటారు.

"రాజు దహస్తున్నాడు కిరణాల వెల్లువ
ప్రజలు కారుస్తున్నారు బాష్పాల కాలువ"

రాజుగారు సంతోషించారు. ఎవరో కొందరు వ్యాఖ్యాతలు రాజు అంటే చంద్రుడనీ, బాష్పాలంటే ఆనంద బాష్పాలని చెప్పారు. ప్రజలూ సంతోషించారు, మరి కొందరి వ్యాఖ్యానం విని.

పరదా వేసికొన్న బొమ్మ అందమైన స్త్రీమూర్తిది.

విప్లవం కోసం కొందరు ప్రయత్నించి నప్పుడు - ప్రభుత్వం వారిని ఊచ ముట్టగా నరికి నప్పుడు ఆయన రాశారు:

"నేలని చీల్చి పెకలించిన తర్వాతే నాటాలి విత్తు
అపుడు విత్తు మొలుస్తుంది - నిలుస్తుంది కలకాలం
విత్తు మొలుస్తుంది తల్లి లాంటి నేల బొమ్మ తన్ని
నిలుస్తుంది తన నీడలో మరో విత్తుని తలెత్త నివ్వకుండా".

పరదా లోంచి చూస్తే అవయవాలు ప్రస్ఫుటంగా కనబడతాయి చూడ కలగాలే గాని.

సాంఘిక దురాచారాల మీద ఆయన రాశారు ఒకసారి:

"ఇచ్చిపుచ్చుకోవడంలో కట్నాల ప్రసక్తి
కలిగించదు నాకు ఏమాత్రం ఆసక్తి".

ఇంత సూటిగా వ్రాశారేమా అని ఆశ్చర్య పొయ్యారు వాఖ్యాతలు. తన కూతుళ్ళకి కట్నాల్లేకుండా దండ మార్పులతో పెళ్ళిళ్ళు చేశారు ఆయన. తన కొడుకులకి "జరిగై" పెళ్ళిళ్ళు ఘనంగా. కట్నాల్లేవు. ముద్దూ ముచ్చటలు మాత్రం నెరవేర్చారు అవతల వారు. వ్యాఖ్యాతలు అప్పుడు గ్రహించ గలిగారు ఆయన వాక్యాల్లోనూ గుంభ

నగా పరదా ఉందని. అందుకే అడిగారు "స్వామి చెప్పండి సూటిగా" అని. ఆయన నవ్వారు. "రాయటం నావంతు - తల పగల కొట్టుకోవడం మీ వంతు" అన్నట్లు. నవ్వు ఆయనకి పరదా.

ఆ అందమయిన బొమ్మని కొంచెం పక్కగా చూస్తే రాక్షసిలా కనబడు తుంది - పక్క చూపులు చూడరే ఎవ్వరూ పెద్దమనిషి లక్షణం కాదు కనక.

"యజమాని సూర్యుడు. కార్మిక నాయకుడు చంద్రుడు" అని అన్నా రాయన ఒకసారి. యజమానులూ, కార్మికులూ సంతోషించారు. కార్మిక నాయకుణ్ణి, యజమాని కావాలని పెంచి పోషిస్తున్నట్లుగా ఎవరో ఒక వ్యాఖ్యాత అర్థం చెప్పాడు. సుందర మూర్తి గారి నవ్వు క్షణకాలంలో మాయమై మళ్ళీ వెలిగింది.

ప్రభుత్వాలు మారినా ఆయన మాత్రం ప్రజాకవే. అలానే ప్రభుత్వ సన్మానాలూ ఆయనకే.

ప్రజాస్వామ్యం బురఖా వదిలి, నియంత బయట పడిన రోజున ఆయన రాశారు:

"స్వేచ్ఛకీ, ఎగిరే గద్దకీ హద్దు
లేమిటి
సొంత గొంతులో ఎదురు గాలి వేగం
తప్ప'."

ప్రజలు ఈ వాక్యాలకి ఎక్కడ లేని ప్రచారం ఇచ్చారు. నియంత మూర్తి గార్ని పిలిపించి తల తీయించ మన్నాడు తన అనుగ్రహంకోసం వినయంగా నిలుచున్న గృహమంత్రితో.

మూర్తి గారు పరదా పారేసి లబో దిబో మన్నారు. తన వాక్యాలకి తనే అర్థం చెప్పారు. "స్వేచ్ఛకి హద్దు గొంతుక. అభిప్రాయాలను గొంతులోనే అది మేసుకోవాలి. గద్ద ఏలిన వారికి చిహ్నం. గద్దకి హద్దు ఎదురు గాలి శక్తి. కనక ఆ శక్తిని అణచడం తవరికి చెల్లు."

నియంత సంతోషించాడు. అయితే ఆయన మాట పట్టింపు మనిషి. "ఈ మాత్ర మింగేసి మరణించండి. రాజ లాంఛనాలతో సాగనంపుతాం".

మూర్తిగారు గోలు మన్నారు. "నన్ను చంపకండి. అశక్తుణ్ణి, ఒకరికి అపకారం గానీ ఉపకారం గానీ చెయ్యలేనివాణ్ణి". మూర్తిగారు వదిలేసిన పరదా నియంత మీద వేసుకొన్నాడు.

"అపకారమూ ఉపకారమూ చెయ్య లేక పోవడం భగవంతుడి లక్షణం. మీరూ దేవుళ్ళాంటి వారు. మన దేశంలో మీలాంటి వారిని గవర్నరుగా వేయడమో, పరదేశాలకు రాయ బార్లుగా పంపడమో మర్యాద. మీరు దేవుడు కనక స్వర్గానికి మా రాయబారి. మీరు వృద్ధు లయ్యారు. కనక స్వర్గా నికి వెళ్ళి నిత్య యవ్వనులై రంభాసంభో గంలో తేలండి".

"మరణించే ముందు ప్రజా కవి
మూర్తి గారు,
జనులారా! ఒక మాట అన్నారు
ప్రజల మంచికే నియంతృత్వం
నియంత లోపల అనంత మయిన
కారుణ్యం ఉంది
పరదాలో బొమ్మ ఎంతో అంద
మయింది

నేరుగా చూడడం నేర్చుకోండి –
నెగ్గుకొస్తారు.
పక్క చూపులు చూడకండి –
పాడై పోతారు''.

ఓ కుర్ర కవి "తన గొంతులో పెట్టిన'' వాక్యాలు విని మూర్తిగారు అవాక్కయ్యారు. ఏడ్చారు. ఆ ఏడుపు ఆనందం కాదని అనబోయ్యారు. అనలేక పోయారు.

మూర్తిగారి గొంతుక పడి పోయింది "స్వేచ్ఛకి హద్దేమిటి? సొంత గొంతుకి తప్ప.''

## * అద్దాలు *

### చాగంటి రామారావు

అద్దాలివి అద్దాలివి
సన్నపాటి అద్దాలివి
రోడ్డుమీద విసిరేసిన
ముక్కలైన అద్దాలివి
రిక్షాలో సీటుక్రింద
గుడిసెలోని గోడలోన
తాపడించినద్దాలివి
గీకేయగ మిగిలినట్టి
శిథిలమైన కళాయితో
చీకటిలో చీకిపోయి
ఊగులాడు అద్దాలివి
నేనవ్విన నవ్వులందు
నిట్టూర్పులై ప్రతిఫలించు
నేపల్కిన పల్కులందు
రోదనలై వినిపించును
నేనేడ్చిన యేడ్పులందు
అపహాస్యములై ధ్వని
యించును
నా కన్నుల ధవళకాంతి
బాధారుణ దీప్తమగును

నా తనువున అంబరాలు
పీలికలై వెక్కిరించు
నా మేనున సౌగంధము
ఘర్మవాసనలు జిమ్మును
నారూపం వాటిలోన
నగుబాటై కనిపించును
నా రూపం వాటిలోన
జీవచ్ఛవమై కదులును
పగిలిన ఈ అద్దాలతో
బాటంతా నిండిపోయె
జగమంతా నిండిపోయె
నా రూపం నన్నుజూచి
పరిహసించి పరిహసించి
శాపమిచ్చి తాపమిచ్చి
తరిమి తరిమి తరిమి తరిమి
చెండాడును చివరికింక
నా రూపం నన్ను పట్టి
చంపేయును చివరికింక
నా రూపం నన్ను పట్టి
తినివేయును చివరికింక.

అద్దాలివి అద్దాలివి
రంగు రంగు టద్దాలివి
రకరకాల అద్దాలివి
పెద్ద పెద్ద అద్దాలివి
కార్లలోన, మేడలలో
నింగినంటు హర్మ్యాలలో
బంగారపు ఫ్రేములలో
నీటుగా బిగింప బడ్డ
ఒకేవైపు దట్టంగా
కళాయున్న అద్దాలివి
కదలిక లేనద్దాలివి
నేనవ్విన నవ్వవవి
నేపల్కిన పల్కవవి
నేనేడ్చిన యేడ్పవవి
నా రూపం వాటిలోన
వికృతమౌ నెందుచేతొ?
నా రూపం వాటికేలో
కనిపించద దెందుచేతొ?
నా రూపం వాటిలోన
పడనీయవ దెందుచేతొ?
నా రూపం వాటిలోన
ప్రతిఫలించ దెదుచేతొ?


**యువజన**

విద్యార్థి, యువజన మాస పత్రిక

సాలు చందా పది రూపాయలు; విడిప్రతి రూపాయి

**హిమాయత్ నగర్, హైదరాబాద్ - 500029**